క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పలు వార్డులకు తాగునీరు అందించడంలో అంతరాయం ఏర్పడుతుందని, పట్టణ ప్రజలు సహకరించాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వాయర్లకు సంబంధించిన ఏరియాలను డివైడ్ చేయడం వల్ల 24, 25, 27 వార్డుల్లో తాగునీరు తక్కువగా వస్తుందని తెలిపారు. కాలేజీరోడ్డు ఏరియాలో నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్నందునా 2, 18, 21, 22, 32వార్డులకు రోజు విడిచి రోజు ఇవ్వడం జరుగుతుందని, ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరించి, ప్రతిరోజు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో..

చెన్నూర్: పట్టణంలోని టౌన్–1ఏరియాలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. టౌన్–1 పరిధిలోని శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, చర్చిరోడ్డు, కొత్తగూడెం కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంజనీపుత్ర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అంజనీపుత్ర చైర్మన్ శ్రీధర్

మంచిర్యాలటౌన్: అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి బుధవారం జిల్లా కేంద్రంలో అంజనీపుత్ర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అంజనీపుత్ర సంస్థ సేవలను విస్తృతంగా నిర్వహించి, ఉత్తర తెలంగాణవ్యాప్తంగా సంస్థ ఇప్పటికే గుర్తింపు పొందగా, మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎస్.కిషన్, సంతోశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆటల పోటీలు



పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం

భీమారం/భీమిని: కన్నెపల్లి, భీమిని, భీమారం మండలకేంద్రాల్లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమారంలో జెడ్పీ ఉన్నతపాఠశాల హెడ్మాస్టర్ విక్రమ్, పీఈటీ విఠల్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘మాలగురిజాల’



మాలగురిజాల టీమ్‌తో ఏఓ

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్‌లో 12రోజుల పాటు నిర్వహించిన రైతు మిత్ర 5మండలాల క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ టోర్నీలో 40టీమ్‌లు పాల్గొనగా మాలగురిజాల జట్టు విజేతగా, చిత్తాపూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు షీల్డ్‌తో పాటు రూ.10వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేలను మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. నిర్వాహకులు ఎంబటి మహేందర్, సురేష్, రాజమల్లేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

హాజీపూర్‌లో టోర్నమెంట్ ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించారు. కొండాపూర్, బుద్దిపల్లి గ్రామాలకు చెందిన నాలుగు టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. మొదటి రోజు బుద్దిపల్లి, కొండాపూర్ జట్లు తలపడగా కొండాపూర్ క్రికెట్ జట్టు విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుద్దిపల్లి జట్టు నిలిచింది. కమిటీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవ్‌కుమార్, స్వామి, రాజేశం, కుమార్, నరేందర్, సత్తయ్య, అశోక్‌గౌడ్, సిద్దార్థ, గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

రోడ్లపై పారుతున్నయ్..!



నస్పూర్ మున్సిపాలిటీ గాయత్రినగర్‌లో...



లక్సెట్టిపేట ఏడో వార్డులో డ్రెయినేజీ లేకపోవడంతో పారుతున్న మురుగు నీరు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీకాలనీలో డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతోంది. దుర్వాసన వస్తున్నా, మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంపై కాలనీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంత కాలనీల్లో డ్రెయినేజీలను నిర్మించకపోవడంతో, రోడ్డుపైన మురుగు నీరు పారుతోంది. దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో, నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యింది. డ్రెయినేజీల్లో మురుగు నిలిచి ఉంటోంది. మరి కొన్నిచోట్ల డ్రెయినేజీలు లేక మురుగు నీరంతా రోడ్డు పక్కన పారుతోంది. షిర్కే నస్పూర్ కాలనీ నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహించే కాలువలో గాయత్రినగర్ వద్ద పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంది.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో పదిహేను వార్డులుండగా సుమారు డెబ్బై అయిదు శాతం డ్రెయినేజీలు పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ తెలిపారు.కానీ అన్ని వార్డుల్లో డ్రెయినేజీ నాలాలు పూర్తిస్థాయిలో పూర్తికాలేదు. కొన్ని వార్డుల్లో నాలాలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పక్క నుంచి పారుతోంది.



హైటెక్‌సిటీ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు



దండేపల్లి: మేదరిపేట పర్దానిగూడలో డ్రెయినేజీలో నిలిచిన మురుగునీరు



హైటెక్‌సిటీ కాలనీలో రోడ్డుపైన పారుతున్న డ్రెయినేజీ నీరు

- చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన
- పలు చోట్ల నిర్మించకపోవడంతో రోడ్లపై పారుతున్న మురుగు
- జిల్లా వ్యాప్తంగా వేధిస్తున్న మురుగునీటి సమస్య
- ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..!

జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని చోట్ల డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతుండగా, డ్రెయినేజీలు ఉన్నచోట చెత్తను తొలగించకపోవడంతో మురుగు నీరు అందులోనే నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ దుస్థితిపై కథనం...



భీమారం: ఎస్సీకాలనీ వెళ్లే దారిలో...



సుద్దాలకు వెళ్లే దారిలో...



చెన్నూర్: లైన్‌గడ్డలో పేరుకుపోయి...



కోటపల్లి: ఎర్రాయిపేటలో...

అధ్వానంగా ఉన్నయ్..!

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/కోటపల్లి/భీమారం /మందమర్రిరూరల్/జైపూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు రోడ్డుపై చేరడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలోని లైన్‌గడ్డ, మారెమ్మవాడ, బ్రాహ్మణవాడ, రజకవాడ, ఇందిరానగర్, ఎస్‌పీవాడలలో నేటికీ డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూర్ రూరల్ మండలంలోని కిష్టంపేటలో సుద్దాలకు వెళ్లే రహదారిలో మురుగుకాలువలు లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. ప్రధాన రహదారి పక్కనే మిషన్ భగీరథ పైపు నుంచి వచ్చే నీరంతా రోడ్డుపై పక్కనే చేరి నీటి కుంటలాగా మారింది. కోటపల్లిలోని పార్‌పల్లి, ఎర్రాయిపేట గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైనే పారడంతో దుర్వాసనతో వెదజల్లుతోంది. భీమారంలో బస్టాండ్ నుంచి ఎస్సీకాలనీ వెళ్లే ప్రధాన రహదారిలో డ్రెయినేజీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడ్డ కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. మందమర్రి మున్సిపాలిటిలో 24వార్డులు ఉండగా 14వార్డులు మున్సిపాలిటీ పరిధిలోకి వస్తాయి. మున్సిపాలిటిలో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య సిబ్బంది లేక కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో పలు వాడల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీ విస్తీర్ణంలో చాలా పెద్ద గ్రామం. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు సరిగ్గా లేకపోవడంతో రోడ్లపైకి డ్రెయినేజీ నీరు చేరుతుంది. ఏళ్ల కిందట డ్రెయినేజీలు నిర్మించడం, అవి కూడుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కంపు కొడుతున్నయ్..!



భీమిని మండలం వీగాం గ్రామంలో...



బెల్లంపల్లి కన్నాల బస్తీలో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో మురుగుకాలువలు అధ్వానంగా తయారయ్యాయి. నెలల తరబడి నుంచి పూడిక తీయించకపోవడం, శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేయించకపోవడంతో మురికి నీరు కాలువల్లో స్థిరంగా నిలిచిపోయి కంపు కొడుతున్నాయి. మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా పారిశుద్ధ్య పనులు చేయడానికి సరిపడా సిబ్బంది లేరు. అరకొరగా ఉన్న సిబ్బందితో పక్షం రోజులకోసారి మున్సిపల్ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. కాంట్రాక్టర్ బస్తీ, బాబు క్యాంపు బస్తీ, బెల్లంపల్లి బస్తీ, హన్మాన్ బస్తీ, గోల్‌బంగ్లా బస్తీ, గొల్లగూడెం, కాల్‌టెక్స్ ఏరియా, అశోక్ నగర్, మధునన్న నగర్, షంషీర్‌నగర్, అంబేద్కర్ నగర్ తదితర బస్తీల్లో మురుగు కాలువలు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బెల్లంపల్లి మండలంలోని అంకుశం, చాకేపల్లి, బుధాకలాన్, గురిజాల, ఆకెనపల్లి, లంబాడి తండాల్లో మురుగు నీటి కాలువలు లేవు. తాండూర్ మండలం సుభద్రకాలనీ మజీద్ వాడకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువలు పూడిక నిండి, చెదిరిపోయి ఉన్నాయి. నెన్నెల మండలంలోని కోణంపేట, ఖర్జీ, ఆవుడం, మైలారం, కొత్తూర్ గ్రామాల్లో నాలీలు అపరిశుభ్రంగా తయారయ్యాయని ప్రజలు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వేమనపల్లి మండల కేంద్రంలోని బొగుడగూడం వాటర్‌ట్యాంకు వద్ద ఊళ్లో నుంచి మురుగునీరు వచ్చి రోడ్డుపై ప్రవహిస్తోంది. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో మురుగు కాలువలు కానరాకుండా మారిపోయాయి. కాసిపేటలోని సోమగూడెం (కె) గ్రామపంచాయతీ ట్యాంక్‌బస్తీలో నీరు నిలిచి పందులకు ఆవాసంగా మారింది.



తాండూర్ సుభద్ర కాలనీలో...

సమస్యల పరిష్కారానికి ఇంటింటికీ వస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: ఎన్నికల్లో ఓట్ల కోసం మీ వద్దకు వచ్చాను. ఇంటింటికీ తిరిగాను.. మీరు ఆశీర్వదించి గెలిపించారు. ఇప్పుడు ఓట్లకు వచ్చినట్లుగానే.. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వచ్చి మీ సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి, కవ్వాల్, జన్నారం గ్రామాల్లో బుధవారం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. గ్రామ సమస్యలు రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్లు తదితర సమస్యలను నేరుగా నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రతిపాదనలు తయారు చేసి ఇస్తే, నిధులు మంజూరు చేపిస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్తానని పేర్కొన్నారు. కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఇంకా తాము అధికారంలో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఆ ఊహ తప్పు అని, ఇప్పటికైనా మారాలని సూచించారు. పదేళ్లు పాలించినా ఇంకా అధికారం దాహం తీరలేదని, ప్రజలు గుణపాఠం చెప్పినా తీరు మారడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులైనా నా వద్దకు రావచ్చన్నారు. ఏదైనా సమస్య ఉంటే కార్యకర్తలు, నాయకులు కూర్చుండి మాట్లాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీలత, లక్ష్మి, గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీలు శ్రీవాణి, రియాజోద్దీన్, తుమ్మం సౌజన్య, ఉప సర్పంచులు రాజేశ్, రవి, చంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, ముత్యం రాజన్న, సీనియర్ నాయకులు రాజశేఖర్, శుభాష్‌రెడ్డి, సుధాకర్‌నాయక్, మచ్చ శంకరయ్య, సయ్యద్ ఇషాక్, ఫసీఉల్లా, రజాక్, మహేశ్, కాలురాం, రాకేశ్, కృపాకర్, ముజ్జు, సత్తన్న, ధర్మునాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

రామకృష్ణాపూర్: తన ఇల్లు తనకు ఇప్పించాలని కోరుతూ క్యాతనపల్లికి చెందిన సిరికొండ పోచయ్య అనే వృద్ధుడు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తన తండ్రికి సంబంధించిన ఇల్లు న్యాయంగా తనకు దక్కాల్సి ఉండగా, మున్సిపల్ అధికారుల పట్టింపులేని తనం కారణంగా వేరొకరి సొంతమవుతుందని ఆరోపించారు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

ఎల్లమ్మ పట్నాల్లో మాజీ ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న పట్నాల వేడుకల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొన్నారు. ఎల్లమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మండలంలోని చింతపల్లి గ్రామానికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రవూఫ్‌ను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

భీమారంలో మల్లన్న పట్నాలు

భీమారం: మండల కేంద్రంలో బుధవారం మల్లన్న పట్నాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చెన్నూరులోని గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, అనంతరం ఉపావాస్య దీక్షతో ఉన్నారు. అనంతరం ఒగ్గు పూజారులు పట్నాలు వేయగా భక్తులు వాటిని తిలకించారు.

సంక్షిప్త వార్తలు

కొమ్మెరలో రక్తదాన శిబిరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెరలో స్థానిక సర్పంచ్ తాళ్లపల్లి జయలక్ష్మి చిన్న కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మంచిర్యాలలోని వలంటరీ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 60మంది యువకులు రక్తదానం చేశారు.

ఏబీవీపీ నగరశాఖ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బెల్లంపల్లి నగర శాఖ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సూర్య, సంయుక్త కార్యదర్శులుగా అరుణ్, హేమంత్, బాలాజీ, కార్తీక్, ఎస్ఎఫ్‌డీ నగర ఇన్‌చార్జీగా ఆకాష్, ఎస్ఎఫ్ఎస్ ఇన్‌చార్జీగా సంతోష్, సోషల్ మీడియా ఇన్‌చార్జులుగా నితిన్, విక్రమ్‌తేజ్‌లను ఎన్నుకున్నట్లు ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ అజయ్ ప్రకటించారు. మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులతో ఎస్సై రవికుమార్

నస్పూర్: ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. సీసీసీలోని న్యూవిజన్ పాఠశాల ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద రోడ్డు భద్రతపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని సూచించారు. భద్రత నియమాలు తప్పనిసరిగా పాటిస్తే ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో సీటు బెల్టు, హెల్మెట్ ధరించని వారికి పుష్పాలు అందించి ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్తయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ కరిష్మా, ఉపాధ్యాయులు హారిక, సంధ్య, లావణ్య, సాయిప్రసన్న, రాజు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్, కపుల్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

మంచిర్యాలటౌన్: వాసవిక్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో బుధవారం నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షులుగా తోట ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా నలుమాసు వెంకటేశ్వర్, కోశాధికారిగా వుత్తూరి శివప్రసాద్, కపుల్స్ క్లబ్ అధ్యక్షులుగా కండె ఓంనమశ్శివాయ, కార్యదర్శిగా పల్లెర్ల శ్రీనివాస్, కోశాధికారిగా వెల్లంపల్లి శ్రీనివాస్‌రావులతో ప్రమాణం చేయించారు.

మాలమహానాడు మండల కమిటీ ఎన్నిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మాలమహానాడు హాజీపూర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనె రాజేశ్ ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం..

దండేపల్లి/మందమర్రిరూరల్: లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన పాలకుర్తి లక్ష్మణచారికి విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రూ.25వేలు, మందమర్రిలోని దీపక్‌నగర్‌కు చెందిన ఆంజనేయులుకు మందమర్రికి చెందిన పట్టణ భవణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూ.20వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

నస్పూర్/భీమారం: జిల్లాలోని పలు మండలకేంద్రాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సీసీసీ నస్పూర్, భీమారం పరిధిలలోని కస్తూర్బాగాంధీ కళాశాలల్లో విద్యార్థినులకు చదువుతోపాటు స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. నస్పూర్‌లో మెడికల్ ఆఫీసర్ సమత, కళాశాల స్పెషల్ ఆఫీసర్ మౌనిక, భీమారంలో ఏఎస్సై శంకుతల, ప్రిన్స్‌పాల్ కనకలక్ష్మి విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్/వేమనపల్లి/కోటపల్లి/చెన్నూర్: జైపూర్ మండలం ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వేమనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో, కోటపల్లి మండలం బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో, చెన్నూర్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. జైపూర్‌లో మహిళా తరంగిణి ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షురాలు శ్రీదేవి విద్యార్థులకు ఉచితంగా మూడు సైకిల్స్ విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్సై శకుంతల

సమస్యలు పరిష్కరించండి

దండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, తహసీల్దార్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమావేశంలో చర్చించిన అంశాలు..

దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు మందులేదని, బయట తెచ్చుకోవాలని చెప్పారని కర్ణపేట సర్పంచ్ రాజేశ్వరి పీహెచ్‌సీ వైద్యుడు సతీష్‌ను ప్రశ్నించారు. కుక్కకాటు, కోతికాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. సబ్సిడీ గొర్రెల కోసం చాలా మంది డీడీలు కట్టినప్పటికీ, గొర్రెల పంపిణీ జరగలేదు. దీంతో డీడీలు కట్టిన వారికి గొర్రెలు ఇవ్వాలి, లేదంటే డీడీలు వాపస్ ఇవ్వాలని ఎంపీటీసీలు శ్రీనివాస్ కమాలకర్ పశువైద్యాధికారి ధన్‌రాజ్‌ను కోరారు. కొండాపూర్, నంబాల, గ్రామాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు వేయాలని, ముత్యంపేటలో ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ట్రాన్స్‌కో ఏఈ రాయనర్సును కోరారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

జీపీడీపీపై అవగాహన

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీపీడీపీ ప్రణాళికలు రూపకల్పన చేశారు. పలు రకాల అభివృద్ధి పనులను ఆమోదించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మంచిర్యాల: 9010299065, 9951602823

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899